www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 4 అక్టోబర్ 2024

5

అన్నమయ్య

వంద రోజుల పాలనపై ప్రణాళికను సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

డిసెంబర్ 31 నాటికి పూర్తయ్యే మరో 100 రోజుల పాలనపై ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సంవత్సరం డిసెంబర్ 31 నాటికి పూర్తవబోయే మరో వంద రోజుల పాలనకు సంబంధించి చేరుకుబోయే లక్ష్యాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి జిల్లా అధికారి తన శాఖకు సంబంధించిన లక్ష్యాలను స్పష్టంగా, నిర్దిష్టంగా ఇవ్వాలని ఆదేశించారు. ఇచ్చిన లక్ష్యాలను సంబంధిత శాఖలు తప్పనిసరిగా చేరుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు
పెండ్లిమర్రిలో విషాదఛాయలు

నందిరెడ్డి శివపార్వతి

నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి

జి.మారుతి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-పెండ్లిమర్రి (కడప అర్బన్)

కడప జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెందిన ఘోర సంఘటన చోటుచేసుకుంది. పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు పొలాల్లో జరిగిన ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో జిల్లాలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులు భయభ్రాంతులకు గురిచేశాయి. ఈ ఉరుములు, మెరుపుల సమయంలో పడిన పిడుగు పాటుకు వ్యవసాయ పనులు, పశువులు కాసుకునేందు కోసం వెళ్లిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తుమ్మలూరు గ్రామానికి చెందిన ముగ్గురు, పగడాలపల్లెకు చెందిన ఒకరు పిడుగుపడే సమయంలో తుమ్మలూరు సమీపంలోని పొలాల్లో ఉన్నారు. వ్యవసాయ పనుల కోసం ఇద్దరు, పశువులు తోలుకొని ఇద్దరు రోజువారీలాగే వెళ్లారు. ఒక్కసారిగా సంభవించిన పిడుగుపాటుకు పశువుల తోలుకవెళ్ళిన నందిరెడ్డి శివపార్వతి(30) ఆమె మరిది కుమారుడు ఆరవ తరగతి చదువుతున్న నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి(10), పగడాలపల్లి గ్రామానికి చెందిన జి.మారుతి ప్రసాద్‌రెడ్డి(30) అక్కడికక్కడే పిడుగుపాటుకు మృత్యువాత పడ్డారు. వీరితోపాటు నాగాయపల్లెకు చెందిన కర్ణాటి నరేష్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈయన్ను కడపకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. రోజువారి వ్యవసాయ పనుల కోసం, పశువుల మేపుకునేందుకు వెళ్ళి నవారు పిడుగుపాటుకు మృతి చెందిన సమాచారం తెలియడంతో తుమ్మలూరు గ్రామంలో తీవ్ర విషాద చాయలు నెలకొన్నాయి. మృతి చెందిన వారిలో నందిరెడ్డి శివపార్వతి, నందిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మృతదేహాను వారి స్వగ్రామమైన తుమ్మలూరుకు తరలించగా, మారుతి ప్రసాద్‌రెడ్డి మృతదేహాన్ని తన స్వగ్రామమైన పగడాడాల పల్లెకు తరలించారు.

సురక్షిత ప్రయాణమే ఆర్‌టిసి లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజా శక్తి రాయచోటి

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్‌టిసి ముఖ్య ఉద్దేశమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి ఆర్‌టిసి బస్టాండ్‌లో 9 నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్‌టిసి లక్ష్యమన్నారు. రాబోయే రోజులలో ప్రయాణికుల కోసం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నూతన బస్సులు కొనుగోలు చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో ఎపిఎస్‌ఆర్‌టిసి పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపారు. రాబోయే కాలంలో ఆర్‌టిసి ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవల అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని నూతన ఆర్‌టిసి బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా రాయచోటి నుంచి విజయవాడకు, మదనపల్లి నుంచి విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సు, రాయచోటి నుంచి తిరుమలకు డైరెక్టుగా రెండు సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లను, పీలేరు నుంచి తిరుపతికి మూడు బస్సులు అందులో ఒకటి ఆర్డినరీ రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు, రాయచోటి నుంచి వేంపల్లికు ఒక ఎక్స్‌ప్రెస్ బస్సులను మంత్రి ప్రారంభించారు.

నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బ్యాంకును ప్రారంభించిన మంత్రి : పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఫినో పేమెంట్ బ్యాంకును మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫినో పేమెంట్ బ్యాంకు వారు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి దినదినాభివృద్ధి చెందాలన్నారు. పట్టణంలో అర్హులైన వారందరికీ విరివిగా రుణాలు ఇచ్చి ఖాతాదారుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఫినో బ్యాంకు మేనేజర్ సిబ్బంది మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలివ్వాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రీన్ అంబాసిడర్లకు 15టవ ఆర్థిక సంఘం నిధుల్లో జీతాలివ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్‌లకు జిల్లాలో 5 నుండి 20 నెలలకుపైగా వేతన బకాయిలు ఉన్నాయన్నారు. నెల క్రితం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించిన నిధుల్లో హరిత రాయబారులకు 50 శాతం వేతనాలకు ఇవ్వాల్సి ఉండగా జిల్లా పంచాయతీ అధికారులు ఇవ్వకుండా జాప్యం చేయడం తగదన్నారు. కాటిమాయకుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునను జీతాలడిగిన వర్కర్లను బూతులు తిడుతున్నారని పని మానేయండి, నన్ను అడగొద్దు ఎంపని చేస్తున్నారు అంటూ చిందులేశారని తెలిపారు. విషయం తెలుసుకున్న అతనికి అనేక సార్లు ఫోన్ చేసినా స్పదించలేదని, కార్మికులు దళితులు పేదవారు కావడంతో బెదిరిస్తున్నారని తెలిపారు. కాటిమాయకుంటకు రెండు సంవత్సరాల నుండి విడుదల చేసిన నిధులు మీద విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్మికుల. పట్ల అసభ్యంగా ప్రవర్తన చూపిన మల్లికార్జున మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనపై రెండు సంవత్సరాల నుండి చేసిన పనికి వేతనాలు రాక అప్పులు చేసి తీవ్ర ఇక్కట్లలో ఉన్న ప్రజారోగ్యం కొరకు చిత్తశుద్ధి తో స్వచ్ఛతా హీ సేవా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్‌ల శ్రమ అభినందనీయమని పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లాలో కార్మికులకు సన్మానాలు చేశారని అయితే వీరికి ప్రధానంగా పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతో పాటు పెరిగిన ధరలకునుగుణంగా కనీస వేతనం రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టే ప్రమాదముందని కలెక్టర్ పంచాయతీ విభాగం మీద జోక్యం చేసుకుని కార్మికుల వేతనాల మీద దృష్టి సారించాలని కోరారు. ట్రాక్టర్ డ్రైవర్‌లకు కేవలం రూ.6 వేలు ఇవ్వడం దారుణమని కనీస వేతనం అమలు చేయాలన్నారు. లేని పక్షాన సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయాలి

- ◆ గాలేరు-నగరి పనులు కోడూరు వరకూ చేపట్టాలి
- ◆ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసి రాజంపేట నియోజకవర్గం ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆకేపాటి భవన్‌లో సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం లోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నమయ్య ప్రాజెక్టు కాంక్రీంటుతో పటిష్టంగా నిర్మించాలన్న సత్సం కల్పంతో పనులు ప్రారంభించారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే 25 శాతం పనులు కూడా పూర్తికాని ప్రాజెక్టులను నిలుపుచేయాలన్న జిఒ తీసుకురావడంతో అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆగిపోయాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రాజెక్టు పనులు వెంటనే పునః ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గాలేరు-నగరి కాలువ రైల్వే కోడూరు నియోజకవర్గం వరకు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివా సులురెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్ రెడ్డిమాసి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య నియంత్రణ

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని పుంగనూరు రోడ్డులో గల టివిఎస్ షోరూంలో నూతనంగా ఆవిష్కరించిన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను గురువారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. షోరూం నిర్వాహకులు సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజ స్థాపనకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదపడతాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కాలుష్యం పెరిగి అనేక రకాల జబ్బులు వ్యాపిస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడకంతో కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. ముఖ్యంగా వాహనాల వినియోగం, ఆదా, లబ్ధి, ఇతర ప్రయోజనాలపై వాహన శ్రేణుల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత షోరూం సిబ్బందిపై ఉందన్నారు. మార్కెట్లోకి అనేక రకాల వాహనాలు వస్తుండడంతో కాలుష్యం పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో సంగం హరి, రాజేష్, కూటమి నేతలు నాదెళ్ల విద్యాసాగర్, శ్రీరామ రామాంజనేయులు, శివ, బాలుస్వామి, నవీన్ చౌదరి, దారం అనిత, నాగార్జునబాబు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇవ్వాలని ఎంపిడిఒకు వినతి



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇవ్వాలని మదనపల్లి డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు గురువారం స్థానిక ఎంపిడిఒ పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రధాన మంత్రి ఆరోగ్య రక్ష కార్డులు జారీ చేశారని అన్నారు. ఈ కార్డు పొందిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తారని అన్నారు. సొంత రాష్ట్రంలోనే కాకుండా ఏ రాష్ట్రంలోనైనా ఈ కార్డు చూపించి వైద్య సదుపాయాలు పొందవచ్చునని ఈ కార్డును ఒక సంవత్సరం వరకు వినియోగించు కోవచ్చని తెలిపారు. మళ్లీ పునరుద్ధరణ చేసుకునే అవకాశం ఉందని, ఏడాదికి ఒకసారి పునరుద్ధరణ చేసుకోవలసి ఉంటుందని అన్నారు. కార్డు పొందుటకు పునరుద్ధరణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేదని, ఇన్ని సౌలభ్యాలు ఉన్న ఈ కార్డులు వచ్చి ఆరు మాసాలు కావస్తున్న సచివాలయాల్లో గుట్టలు గుట్టలుగా అమర్చబడి ఉన్నాయికానీ ఒక కార్డు కూడా ప్రజలకు అందించలేదని అన్నారు. వెంటనే కార్డులను ప్రజలకు అందించి ఉచిత వైద్య సేవలు పొందుటకు అవకాశం కల్పించాలని ఎంపిడిఒకు సూచించినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి రాయచోటి

ఎన్‌టిఆర్ హౌసింగ్ ఇళ్ళ నిర్మాణాల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అన్ని మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, తదితర శాఖల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాల్సిన ఇళ్లపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. సిమెంటు, స్టీలు, ఇసుక, తదితర అవసరాలలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 78,221 ఇళ్లకు గాను 44 శాతం పూర్తయ్యాయని మిగతా వాటిపై దృష్టి సారించి పూర్తి చేయాలని అన్నారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకంలో లబ్ధిదారుల గుర్తింపు 65 శాతం పూర్తయిందని మిగతా 35 శాతం వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎంపిడిఒలు మిగతా శాఖలతో సమన్వయం చేసుకొని ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మండల ప్రత్యేక అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షించి పురోగతిని తీసుకురావాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

- సర్వసభ్య సమావేశంలో వార్డు సభ్యుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణ ప్రజల ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని వార్డు సభ్యులు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా అధ్యక్షతన వార్డు సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వార్డు సభ్యులు ఉదయ్‌కుమార్, విక్టరీ వెంకట రమణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సుకన్య మాట్లాడుతూ గ్రామపంచాయతీలో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి పీలేరు పట్టణంలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని అన్నారు. తాగు నీటి సరఫరా కోసం ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లలో కొన్ని వివిధ రకాల సమస్యలతో మూత పడుతున్నాయని, అవి పూర్తిగా వాడు కాకముందే సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించి వాటిని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. పట్టణంలో కొన్ని చోట్ల మురుగునీటి కాలువలు దెబ్బతినడం, మరికొన్ని చోట్ల కాలువలున్నా వాటి సామర్థ్యానికి మించి వ్యర్థాలు ప్రవహిస్తుండడంతో మురుగునీరు రోడ్లపైకి రావడం, కొత్తగా ఇండ్ల నిర్మాణాలు జరిగిన ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు లేక పోవడంతో అక్కడి స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనదారులకు సమస్యగా మారు తోందని చెప్పారు. సర్పంచ్ హబీబ్‌బాషా మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పెంచిన వేతనాలు కొనసాగించాలని, పట్టణంలో వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. స్పందించిన ఇఒ వై. గురు మోహన్ సమాధానమిస్తూ తాను పంచాయితీ ఇంచార్జ్ ఈఓగా జూన్ 27న బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.6.79 లక్షల నిధులు మాత్రమే ఉండేవని, సిబ్బంది వేతనాలకు, పట్టణంలో దినసరి పనులు చేపట్టడానికి, నేటి సరఫరా కోసం వినియోగించే మోటర్ల మరమ్మతులు, వాహనాల మరమ్మతులు, నిర్వహణ, ఇతర అవసరాల కోసం తగినన్ని నిధులు లేకపోవడంతో సిబ్బంది సహకారంతో పట్టణంలో మొండి బకాయిల వసూళ్లకు ప్రయత్నించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పంచాయతీలో రూ.21.63 లక్షల సాధారణ నిధులు, రూ.71 లక్షల 15వ ఆర్థిక నిధులు ఉన్నాయన్నారు. పంచాయితీకి ఇప్పటికీ రూ.3.29 కోట్లు అప్పులు ఉన్నాయని సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు పట్టణంలో నీరు, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత నిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డు సభ్యులు కాలేషా, మల్లికార్జున రెడ్డి, హబీబ్, ఇతర సభ్యులతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషన్ కుమార్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి కృషి :'నల్లారి'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని గండబోయనపల్లిలోని శ్రీ సత్యమ్మతల్లి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కు ఆలయ కమిటీ చైర్మెన్ పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిషన్ మాట్లాడుతూ దసరా ఉత్సవాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కంభం నిరంజన్ రెడ్డి, కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర రెడ్డి, మాజీ ఎంపిపి చంద్రకుమార్ రెడ్డి, గండబోయనపల్లి సర్పంచ్ గుర్రప్ప, నాయకులు మల్లికార్జున రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, క్రిష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ కౌన్సిల్ సమావేశానికి రావొద్దని టిడిపి నిరసన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్ సమావేశానికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రావద్దని టిడిపి రూరల్ మండలాధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు ఆధ్వర్యంలో గురువారం టిడిపి శ్రేణులు పురపాలక కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గో బ్యాక్ మిథున్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. విషయం ముందుగానే గ్రహించిన మిథున్ రెడ్డి కౌన్సిల్ సమావేశానికి రాకుండా వెనుదిరిగారు. పోలీసులు టిడిపి నాయకులకు నచ్చజెప్పి నిరసన విరమింపజేశారు. ఈ సందర్భంగా సుబ్బనరసయ్య నాయుడు మాట్లాడుతూ మిథున్‌రెడ్డి తన స్వార్ధ ప్రయోజనాల కోసం జిల్లా కేంద్రం రాయచోటికి తరలించి రాజంపేటకు తీరని అన్యాయం చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్ యోగ్ పోటీల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తిరుపతి ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (ఐఐటి) వారు నిర్వహించిన సన్‌యోగ్-2024 పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. వంద మీటర్ల పోటీలలో వై.వెంకటయ్య బంగారు పథకం, లాంగ్ జంప్ పోటీలో కాంస్య పథకం, హెచ్ నరేంద్ర డిస్క్రోలో మూడవ బహుమతి, బి.ఆమోస్, కె.హేమంత్ కుమార్‌రావు, ఎస్.అబ్దుల్ మూకీత్, కె.దిలీప్ కుమార్, ఎ.చందు లు బాడ్మిం టన్‌లో రన్నర్స్‌గా నిలిచారని అన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

పాడి రైతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు : మంత్రి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా వారికి అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. జిల్లాలోని రైతులందరూ వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం కూడా పాటించాలన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కానప్పుడు వర్షాలు సరిగా పడనప్పుడు రైతుల కుటుంబాలు చితికి పోకుండా పాడి పశువుల పెంపకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రామీణ యువతీ యువకులకు మరియు నిరుద్యోగులకు పాడి పరిశ్రమ చక్కటి ఉపాధి అందిస్తోందన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులు వాడికి సంబంధించిన రుణాలు సబ్సిడీలు తెలియజేస్తూ ఎక్కువమంది పాడి రైతులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా సబ్సిడీ రుణాలు తదితర వివరాలను పాడి రైతులకు తెలియజేయాలని మంత్రి పశు సంవర్ధక శాఖ అధికారులకు. సూచించారు. అనంతరం లేక దూడల కృత్రిమ గర్భం ద్వారా పుట్టినటువంటి సంకరజాతి దూడల ప్రదర్శనను మంత్రి తిలకించి బహుమతి పొందిన దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి దూడకు కన్సిలేషన్ బహుమతులు అందజేశారు. బోరెడ్డిగారిపల్లెలో ప్రతిరోజు ఉదయం 300 లీటర్లు సాయంత్రం 300 లీటర్లు పాల సేకరణ జరుగుతోందని దీన్ని మరింత పెంచి రైతుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలని మంత్రి పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు.

పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్య అధికంగా ఉందని ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన గ్రామాలలో బోర్లు వేసి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అమ్మవారి సన్నిధిలో ఎంపి, మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు

దసరా వేడుకల్లో ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

దసరా ఉత్సవాలుసందర్భంగా గురువారం పాత బజార్‌లోని ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గునిశెట్టి రమేష్ ఆహ్వానం మేరకు వైసిపి నాయకులు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, సిహెచ్ రమేష్, అంబటి మురళి, మండల నాగేంద్ర, సర్పంచ్ శివయ్య, మాజీ జడ్‌పిటిసి మారెళ్ల రాజేశ్వరమ్మ, ఎంపిటిసిలు రావూఫ్, సర్పంచ్ దార చంద్రశేఖర్, పోలా రామారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతికి 'గడికోట' నివాళి

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు మాజీ ఉప సర్పంచ్ తంగాలవీరారెడ్డి(58) అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి గురువారంత వీరారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అతని మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. గాలివీడు గ్రామ అభివృద్ధికి వీరారెడ్డి చేసిన సేవలు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. శ్రీకాంత్‌రెడ్డితో పాటు వైసిపి మండల కన్వీనర్ పిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండి చిన్నరెడ్డి, తంగాల గోపాల్, మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి, మాజీ ఎంపిటిసి దాసర చిన్నరెడ్డి, బిసి కన్వీనర్ వల్లెపు నగేష్, సోషియల్ మీడియా షమీర్, వెంకటాద్రి, సిద్దయ్య, సుబ్బారెడ్డి, హోటల్ నాయుడు నివాళులు అర్పించారు.

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-కలికిరి

పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గుట్టపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. బంధువుల కథనం మేరకు.. గుట్టపాలెం గ్రామ కస్పాకు చెందిన పూజారి పార్వతమ్మ(65) బుధవారం తమ పొలంలో వేరుశనగ చెట్లు పెరుగుతుండగా పాము కాటుకు గురైంది. వెంటనే బంధువులు కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతిచెందారు.

పార్వతమ్మ (ఫైల్ ఫోటో)

ఆనంద నిలయంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సాయితేజేష్

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పెద్దవరంపాడు పంచాయతీ రాళ్లచెరువుపల్లిలో జీవనజ్యోతి అనాధ ఆనంద నిలయ ఆశ్రమంలో గురువారం అనంత రాజుపేట నివాసమున్న గేవిని సుబ్బరామయ్య, చిన్నమ్మల కుమారుడు సాయితేజేష్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం గొప్పదని అన్నారు. అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అవినాష్, రవికుమార్, రెడ్డయ్య, రణదీప్, త్రివేద్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎస్‌పి కృష్ణమోహన్

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి-కలికిరి

అసాంఘిక కార్యకలాపై దృష్టి సారించాలని రాయచోటి నూతన డిఎస్‌పి ఎం ఆర్ కృష్ణమోహన్ పోలీసులకు సూచించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాటుసారా విక్రయాలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి సరఫరా వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచి పోలీసుల పట్ల ప్రజలకు విశ్వాసం, నమ్మకం కలిగించే విధంగా చూడాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఆదేశించారు. అనంతరం పోలీసు రికార్డులను తనిఖీ చేశారు. నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ ను పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ రెడ్డి శేఖర్ రెడ్డి, ఎఎస్ఐ మహబూబ్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

కాలుష్య కోరల్లో కుషావతి నది

- పొగ, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కలుషితమవుతున్న నదీ జలాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- డంపింగ్ యార్డు ఏర్పాటుపై దృష్టి పెట్టని అధికారులు

నదిలో కలుషితమైన నీరు

డంపింగ్ యార్డును తలపిస్తున్న కుషావతి నగర్

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులోని కుషావతినది డంపింగ్ యార్డును తలపిస్తోంది. స్థానిక పంచాయతీ నుంచి వస్తున్న చెత్తా చెదారం, వ్యర్థాలను పంచాయతీ కార్మికులు ట్రాక్టర్‌ల ద్వారా తీసుకవచ్చి పట్టణం దిగవనున్న కుషావతి నది వద్ద డంపింగ్ చేస్తున్నారు. ఆ చెత్త ఎప్పుడు కాలుతూ ఉండడంతో స్థానికంగా నివాసమున్న కుషవతి నగర్, గౌస్‌నగర్, పెద్దూరుకస్పా ప్రాంతాలు కాలుష్యమై పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం పొగ కాలుష్యంతో పాటు వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో ఇక్కడ ఉండలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నదీ గడ్డపై చెత్తను కుప్పలుగా వేయడంతో ఆ వ్యర్థాలన్నీ నదిలోకి కలసిపోయి నదీ పరివాహక ప్రాంతమంతా కాలుష్యభరితంగా మారిం దని అన్నారు. నదిలోని నీటిని తాగిన జంతువులు, పక్షులు మూగజీవుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని తెలిపారు. మండలంలో 17 గ్రామాలు ఉన్నాయని వాటిలో 16 గ్రామాలకు డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, మేజర్ పంచాయతీ అయిన గాలివీడులో డంపింగ్ ఏర్పాటు చేయకపోవడంతో శోచనీయమని అన్నారు. అప్పటి జిల్లా మొదటి కలెక్టర్ గిరీష తహశీల్దార్ దైవాదీనంకు గాలివీడులో డంపింగ్ యార్డ్‌కు ఐదెకరాలు స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు కలెక్టర్ ఆదే శాలను విస్మరించడంతో పంచాయతీ సిబ్బంది వ్యర్థపదార్థాలను తరలించేందుకు స్థలంలేక కుషావతినది వద్దే డంప్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టిపెట్టి డంపింగ్ యార్డ్ కు స్థలాన్ని కేటాయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలి

మేజర్ పంచాయతీకి డంపింగ్ యార్డ్ లేకపోవడం శోచనీయం. రాయచోటి తర్వాత పెద్ద మండలం గాలివీడు. మండలంలోని 17 గ్రామాల్లో 16 గ్రామాలకు డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. గాలివీడుకి ఎందుకు కేటాయించలేదు. అధికారుల అలసత్వం తేటతెల్లమవుతోంది. ఇప్పటికైనా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి.

-పాలగిరి రహంతుల్లా, గాలివీడు

మంత్రి దృష్టికి డంపింగ్ యార్డు సమస్య

గాలివీడు పంచాయతీకి వ్యక్తపదార్థాలు నిర్వహించడానికి డంపింగ్ యార్డ్‌కు స్థలాన్ని కేటాయించాలని ప్రజా దర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి తీసుకెళ్లాం. కుషావతినగర్‌లో వ్యర్థ పదార్థాల నిల్వ లేకుండా, కుషావతి నదీ పరివాహ ప్రాంతం శుభ్రంగా ఉంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

-మస్తాన్ బాబు, గాలివీడు

రెవెన్యూ అధికారుల సహకారంతో నిర్మాణాలు చేపడతాం

గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ గిరీష డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని అప్పటి తహశీల్దార్ దైవాదీనంకు సూచించారు. స్థలం కేటాయింపు ఆలస్యం కావడంతో నిర్మాణాలు చేపట్టలేకపోయాం.రెవెన్యూ అధికారుల సహకారంతో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

- శేఖర్‌నాయక్, ఇఒపిఆర్‌డి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారులు మునికుమార్ సూచించారు. గురువారం మండలంలో గోపిదిన్నె రేణుమాకులపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యాలయం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 80 మందికి రక్తపోటు, డయాబెటిస్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆశాలత, ఎఎన్ఎం భారతి, సుజాత, ఆశా కార్యకర్తలు, చంద్రకళ, నిర్మలమ్మ, వెంకటరమణమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-కలికిరి : ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చునని ప్రభుత్వ వైద్యులు పవన్ వృద్ధులకు సూచించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పదిరోజులు పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధులకు బిపి, షుగర్, మానసిక, కంటి జబ్బుల గురించి పరీక్షల నిర్వహించి, మెరుగైన ఆరోగ్యం కొరకు వారికి సూచనలు, సలహాలు అందించి అవగాహన కల్పించారు. వారి అనుభవాలు, లోపాలు కష్టనష్టాలపై ఆరా తీసి వారికి వైద్య సహకారం అందించడం నేషనల్ హెల్త్ మిషన్ ముఖ్య ఉద్దేశమని, ఈ కార్యక్రమంలో వృద్ధులందరికీ సహాయ సహకారాలు అందిస్తూ, వారి ఆరోగ్యం పదిలంగా ఉండడానికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మురళి, ఆసుపత్రి సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

కలికిరి: వృద్ధులకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు పవన్

పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన : డిపిఒ

మాట్లాడుతున్న డిపిఒ ధనలక్ష్మి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్థిక సంఘం నిధులతో గ్రామపంచాయతీలో మహర్దశను తీసుకొద్దామని జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చీకలబైలు గ్రామ పంచాయతీ, చీకలబైలు గ్రామ సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ ఎం.ప్రభాకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు డిపిఒ హాజరై మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధుల గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్యను నివారించుటకు, కొత్తగా డ్రెయినేజీ కాలువలు నిర్మించుటకు, వీధి దీపాలు నిర్వహణ కొరకు వినియోగించుకోవాలన్నారు. తదుపరి మిగిలిన నిధులను సురక్షిత నీటి వినియోగం కొరకు, ఆర్ఒ ప్లాంట్ నిర్వహణ, చిన్ననీటి ట్యాంకులు అమర్చుటకు, సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి సౌర విద్యుత్ ఉత్పాదనకు ఉపయోగించాలన్నారు. పంచాయతీలో పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేయాలన్నారు. అనంతరం సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో చీకలబైలు పంచాయతీపై నిర్లక్ష్యం చూపారని అన్నారు.సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రవి, గ్రామ సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిఐకు వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

మద్యం దుకాణాలు బడులకు దూరంగా ఉండేలా చూడాలి

ప్రజాశక్తి-పీలేరు : మద్యం దుకాణాలు బడులు, గుడులు, ప్రార్థనా మందిరాలకు అవి దూరంగా ఉండేలా టెండర్ల ప్రక్రియలో తగిన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు కోరారు. గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో పీలేరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ విద్యాసంస్థలు, ప్రార్థనా స్థలాలకు సమీపంలో మద్యం షాపులు ఉన్నట్లయితే యువత, స్థానిక ప్రజలపై వాటి ప్రభావం చూపే ప్రమాదముందని అన్నారు.ఈ టెండర్ల ప్రక్రియలో కచ్చితమైన నిబంధనలతో మద్యం షాపులు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు ప్రజల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి యూసఫ్, మాజీ మండల అధ్యక్షులు చాంద్‌బాషా, కానిస్టేబుల్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నీరుగట్టువారిపల్లిలో వెలసిన శ్రీచౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం పసుపు అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీచౌడేశ్వరీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్పాహార దాతలు జి.చిన్న రెడ్డయ్య, ఎన్. నాగేష్‌లను ఆలయ కమిటీ సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్య దర్శి బండి పవన్‌కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య, 33వ వార్డు కౌన్సిలర్ ఎం.వి.రమణ, శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో..

పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో దసరా మహోత్సవాలు ఈ నెల3 నుంచి 13వ తేది వరకు కొనసాగుతాయని ఆర్యవైశ్య సంఘంఅధ్యక్షులు ఓం ప్రకాష్ తెలిపారు. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 13వ తేది వరకు లోక కళ్యాణార్థమై ఆర్యవైశ్య కులం అభివృద్ధి కొరకు శరన్నవ రాత్రులందు ప్రతిరోజు దుర్గా సప్తశతి పారాయణం చేయడం జరుగుతుందని అధ్యక్షులు ఓం ప్రకాష్ తెలిపారు.

వయోవృద్ధుడికి సీనియర్ సిటిజన్స్ బాసట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అనారోగ్యంతో బాధపడుతున్న 88 ఏళ్ల వయోవృద్ధుడు లక్ష్మన్నకు సీనియర్ సిటిజన్స్ బాసటగా నిలిచారు. ఎపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాల కృష్ణ, ఉపాధ్యక్షులు రమణ వృద్ధుడి వెళ్ళి పండ్లు ఫలహారాలు యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్లుగా తాము అండగా వుంటామని భరోసానిచ్చారు. అతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు వున్నారు. వారిలో కుమారుడికి కౌన్సిలింగ్ ఇచ్చి తండ్రి బాగోగులను చూసుకోవాలని సూచించారు.

వేరుశనగ పంటకోత ప్రయోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పంటకోత ప్రయోగంపై అవగాహన

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని నూలివీడు గ్రామంలో గురువారం వేరుశనగ పంటకోత ప్రయోగంపై మండల వ్యవసాయ అధికారి ఎం.మురళీధర్ రైతులకు అవగాహన కల్పించారు.వేరుశనగ దిగుబడిని లెక్కించడం జరిగినది. వెలిగల్లు, తూముకుంట గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది క్యాక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మంగళ, బుధవారంలో మండలంలో రోజుకి రెండు రైతు సేవ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. రైతులకు వ్యవసాయంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ చందన పియ, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న స్థానిక ప్రజలు

ఆట స్థలంలో రోడ్డు నిర్మాణం వద్దు

-తహశీల్దార్‌కు ప్రజలు వినతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ ఎదురుగా ఉన్న పాత కళాశాల మైదానం మీదగా రోడ్డు నిర్మాణం చేపట్టవద్దని గణేష్ యూత్ సభ్యులు స్థానికులు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంబళ్లపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న సివిల్ సప్లయర్స్ గోడౌన్‌కు మైదానం మీదగా రోడ్డు వేయడానికి కాంట్రాక్టరు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఈ మైదానం చుట్టూ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఐటిఐ, విద్యుత్ విద్యా, దేవదాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయని దీంతో ఈ మైదానం నిత్యం ఆడుకునే పిల్లలు ప్రజలతో రద్దీగా ఉంటుందని తెలిపారు. ఈ ఆట స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడితే గోదాముకు వచ్చి వెళ్లే పెద్ద పెద్ద లారీలతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మైదానం మీదుగా కాకుండా మరోవైపు ఉన్న స్థలంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మని, స్థానికులు చంద్రశేఖర్, బాలకృష్ణ, రవి, రెడ్డి, గణేష్ యూత్ సభ్యులు, శంకరా,జనార్ధన్, శ్రీకాంత్, ప్రసాద్ , నవీన్, సుజన్, తరుణ్, శేషు పాల్గొన్నారు.

క్యాండిల్ ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చిన్నారిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-పీలేరు

చిత్తూరు జిల్లా, పుంగనూరులో చిన్నారి ఆస్పియాను కిడ్నాప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, గురువారం రాత్రి ఆ చిన్నారి ఆత్మ శాంతిని కోరుతూ పీలేరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి, ప్రజా సంఘాలు, ముస్లిం జేఏసీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు క్రొవ్వత్తులతో ర్యాలీ చేశారు.

ప్రత్యేక అలంకరణలో చెర్లోపల్లి రెడ్డెమ్మ

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డెమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు శ్రీ అమ్మవారు రెడ్డెమ్మ తల్లి గా భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. రెండవ రోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా దర్శనమిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విద్యుత్ స్తంభం పై నుంచి పడి ఓ వ్యక్తి గాయపడిన సంఘటన తంబళ్లపల్లి గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తంబళ్లంల్లెకు సమీపంలోని ఇట్నేరివారి పల్లెకు చెందిన ఈశ్వరయ్య మల్లయ్య కొండ శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. గురువారం కొండపైన వీధిదీపాలు మరమ్మతు చేసే క్రమంలో విద్యుత్ సరఫరా అవ్వడంతో కరెంటు స్తంభం పై నుంచి క్రిందపడి గాయాలైనట్లు తెలిపారు. అక్కడే ఉన్న తోటి సిబ్బంది తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. నడుం నొప్పి కాళ్ళు ఎక్కువ నొప్పి ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించారు.

ఘనంగా ఎల్‌ఐసి 60వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : స్థానిక కదిరి రోడ్డులోని ఎల్‌ఐసి కార్యాలయంలో ఎల్‌ఐసి 60వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి ఏజెంట్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజలు అన్నివిధాల భరోసా కల్పిస్తూ ఒక తోడు నీడగా ఎల్‌ఐసి ఉపయోగపడుతుందని అన్నారు. దేశంలోని మొట్టమొదటి స్థానంలో ఎల్‌ఐసి ఉండడం గర్వకారణమన్నారు. ఇలాంటి సంస్థలు తాను ఏజెంట్ నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు ఆర్థికంగా, సహాయనిధిగా ఎల్‌ఐసిని వాడుకుంటున్నారని తెలిపారు. 60 ఏళ్లలో ఎంతోమంది దేశంలో ఎల్‌ఐసి వల్ల ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్నీ మంచి పాలసీలు ప్రవేశపెట్టి ప్రజల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి డిఒలు, ఏజెంట్లు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఏజెంట్లు

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో

I.A. NO. 188/2024
in
O.S NO. 57/2024

షేక్ జబివుల్లా S/o షేక్ మహమ్మద్ ఖలీల్, వయస్సు 43 సంవత్సరాలు, ముస్లిం, సాకిన్, జి.ఎన్ నాయుడు కాలనీ, ఆర్.ఎస్ రోడ్డు, రాజంపేట (టౌన్ & మండలం), అన్నమయ్య జిల్లా. ...పిటీషనర్

V/s

షేక్ మహమ్మద్ వాజిద్ అలి S/o షేక్ చాన్ బాషా, వయస్సు 47 సం.ముస్లిం సాకిన్, D.No. 6/1035, ఆర్.ఎస్ రోడ్డు, రాజంపేట (టౌన్&మండలం), అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్

నోటీసు

పై కనిన పిటీషనరు, రెస్పాండెంట్ అయిన నీపై పై కోర్టులో I.A.NO. 188/2024 ; U/O 39 Rule 1 and 2 cpc పిటీషన్ దాఖలు చేసియున్నాడు. కావున నీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల 16-10-2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట నీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
కే. చంద్రమోహన్ రెడ్డి,
పిటీషనరు పరం అడ్వకేట్,
రాజంపేట.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో

O.S.NO. 57/2024

షేక్ జబివుల్లా S/o షేక్ మహమ్మద్ ఖలీల్, వయస్సు 43 సంవత్సరాలు, ముస్లిం, సాకిన్, జి.ఎన్ నాయుడు కాలనీ, ఆర్.ఎస్ రోడ్డు, రాజంపేట (టౌన్ & మండలం), అన్నమయ్య జిల్లా. ...వాది

V/s

షేక్ మహమ్మద్ వాజిద్ అలి S/o షేక్ చాన్ బాషా, వయస్సు 47 సం.ముస్లిం సాకిన్, D.No.6/1035, ఆర్.ఎస్ రోడ్డు, రాజంపేట (టౌన్&మండలం), అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పై కనిన వాది, ప్రతివాది అయిన నీపై పై కోర్టులో specific performance దావా దాఖలు చేసియున్నారు. కావున నీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల 16-10-2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట నీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
కే. చంద్రమోహన్ రెడ్డి,
వాదిపరం అడ్వకేట్,
రాజంపేట.

IN THE COURT OF THE HON'BLE I ADDL., DISTRICT JUDGE, KADAPA

D.O.P. No. 40/2023

Darla Nava Sree, W/o. Pitchala Muralidhar, D/o. D. Yesurathnam, Christian, aged 31 years, House wife, residing at D.No. 3/1766-16, back side of Beraka Church, Raja Reddy Street, Kadapa city, Y.S.R. District. **...Petitioner**

Vs

Pitchala Muralidhar, S/o. P.Venkata Ramana, Christian, aged about 41 years, now working as Deputy Surveyor in Revenue Department, Madanapalli. Now residing at C/o. Pitchala Ramesh, D.No. 4-29-A-19-11- E, Donthi Street, B.K. Palli, Madanapalli Town, Chittoor District. **...Respondent**

NOTICE TO RESPONDENT

Please take notice that the Hon'ble Court has ordered for notice to the respondent to appear on 14-10-2024 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//
V. HARINADHA REDDY,
Advocate for Plaintiff,
KADAPA.